మానవత్వం మరువకు

హెచ్.ఐ.వి. అంటే అర్థంకాక అయోమయంగా చూసిన కవితని చూసి, ఆమెకి అర్థం కాలేదన్నది అర్థం అయి 'ఎయిడ్స్' అంది డాక్టరు రిపోర్టు చూపిస్తూ.

కవిత భయంతో బిగుసుకుపోయి పెద్ద పెద్ద గుడ్లేసుకుని డాక్టరువంక చూసింది. కళ్లలో గిర్రున నీరు తిరిగింది. అప్రయత్నంగా కళ్లనిండా నీరు కారుతుంటే బిక్క చచ్చి డాక్టరు వంక వెర్రిగా చూసింది.

"అలా ఏడవకు. ఏం భయం లేదు... ఇప్పుడు బోలెడు మందులొచ్చాయి. ప్రభుత్వం మందులు ఉచితంగా ఇస్తుంది. మందులు రోజు వేసుకుంటూ, బలమైన ఆహారం, అంటే పాలు, గుడ్డు, పండ్లు తింటూ, రోజు నడక, వ్యాయామం చేస్తూ ఆరోగ్యం కాపాడుకుంటే బాగయిపోతుంది." మందులు ఎక్కడ తెచ్చుకోవాలో చెప్పి రిపోర్టు కాగితాలు చేతికి యిస్తూ... "చూడు. ఈ హెచ్.ఐ.వి. తగ్గాలంటే రోగంతో పోరాడే శక్తి శరీరానికి వుండాలి. అప్పుడు అదే పారిపోతుంది జబ్బు. ముందు మనసుకి భయం పోవాలి. యిదీ అన్ని జబ్బుల్లాంటిదే... తగ్గిపోతుంది. ఎయిడ్స్ అంటే మరణమే అనుకోనక్కరలేదు." డాక్టర్ ఓదార్పుతోపాటు ధైర్యం చెప్తూ అంది.

పాలు, గుడ్డు, పండ్లు, బలమైన ఆహారం - గంజికే లేనిదానికి యివన్నీ తినే అవకాశం వుంటే యీ సమస్య ఎందుకు తెచ్చుకునేది, వళ్లమ్ముకుంటే గాని నోట్లోకి వేళ్లు వెళ్లని స్థితి అన్నది డాక్టరమ్మకి తెలియదేమో! కూటికి లేని వాళ్లంతా వళ్లమ్ముకోరు, కాయకష్టం చేసుకు బతుకవచ్చుగా అనచ్చు. తన ఖర్మ కాలి యీ ఊబిలోకి దిగబడింది. దిగబడ్డాక గాని పైకి రాలేం అన్నది తెలియలేదు. కావల్సిందే! తనలాంటి వాళ్లకి

యీ శాస్తి! తల్లిదండ్రులని కాదని గడపదాటిన అమ్మాయిలకీశాస్తి కావలసిందే. చేతిలో రిపోర్టు పట్టుకుని మందులిచ్చే వైపు జీవచ్ఛవంలా నడుచుకుంటూ వెళ్లింది. "చూడమ్మాయి... " వెనకనించి మళ్లీ డాక్టరు పిలిచింది. "చూడు అందరూ యిది అంటరాని జబ్బని, ఒకరి నుంచి ఒకరికి వస్తుందనుకుంటారు. అదేం లేదు. అందరిలా మామూలు జీవితం గడపవచ్చు. కేవలం సెక్స్ ద్వారా, రక్తం మార్పిడి ద్వారా వస్తుంది. ఆ రెండింటితో జాగ్రత్త పడితే చాలు. ఊరికే భయపడి ఏడుపులు, రాగాలు పెట్టి అందరికీ చెప్పుకుంటే నిన్ను వెలేసినట్టు చూస్తారు. మళ్లీ మామూలవచ్చు." అంది. శుష్కహాసం చేసి వెనుదిరిగింది కవిత.

డాక్టరు చెప్పిన జాగ్రత్తలో ఒకటి పాటించగలదు! రెండోది... అదే తన జీవనం కదా... దానికి దూరంగా... ఆలోచిస్తుంటే.. కసి, కోపం, కక్ష, పగ, దుఃఖం, నిస్సహాయత... తననీ దుస్థితిలో పడేసిన మగాళ్లందరిమీదా కసి... మగజాతినంతటిని నల్లుల్లా కాలికింద నలిపేయాలన్నంత కసి... తను యిలా అవడానికి కారణం అయిన మగాళ్లందరినీ తలలో పేలల్లా ఏరి, గోళ్లతో నొక్కి పారేయాలన్నంత కసి... పురుషజాతినంతటినీ కాళ్లకింద తొక్కి పెట్టాలన్నంత ఆవేశం. కారుతున్న కన్నీళ్లు తుడుచుకోకుండానే అలా నడిచి నడిచి ఇల్లు చేరింది. అలసిపోయి, వాడిపోయి, నీరసంగా యిల్లు చేరి గది తాళం తీసి మంచానికి అడ్డం పడిపోయింది నిస్త్రాణగా.

చప్పుడు విని పక్కగది కనకం లోపలికి వచ్చి, "అక్కా! వచ్చావా... యీ రోజన్నా రిపోర్టు వచ్చిందా? డాక్టరేమన్నారు? నీర్సంగా ఉందంటే ఏం అన్నారు?" గబగబా ఆరాటంగా ప్రశ్నలు గుప్పించింది. కవిత కళ్లు తెరిచి నీర్సంగా నవ్వింది. "కాసిని మంచినీళ్లు తెద్దూ" అంది లేచే ఓపిక లేనట్టు. "అయ్యో... పొద్దుటనగా పోయావు తిండి తిప్పలు లేకుండ. ముందు మంచి నీళ్లు తాగు. అన్నం వండాను నీకోసం కూడా. పట్టుకొస్తానుండు." అంటూ గ్లాసు అందించి తన గదిలోకి వెళ్లింది. పళ్లెంలో అన్నం పెట్టి, యింత టమోటా వేసి పల్చగా చేసిన పప్పు వేసి తీసుకొచ్చి "లే లే.... ముందు అన్నం తిను." అంది. కవిత పెట్టిందే చాలన్నట్లు ఆబగా తిని.. ప్రాణం కుదుటపడ్డాక "అయిన వాళ్లందరినీ దూరం చేసుకున్నా. నీవే మిగిలావు." అంటూ చీర కొంగుతో కళ్లు తుడుచుకుంది. "సర్లే. మనం ఒకరికొకరం తోడు. మన బతుకుల్లో అయినవారంతా వుండరులే."

"సర్లే చెప్పు. డాక్టర్ ఏమన్నారు. మూడు నెలలుగా రిపోర్టు రాలేదంటూ

తిప్పుతున్నారు. ఏవో మందు బిళ్లలు యిస్తూనే వున్నారు.. యిప్పుడేమన్నా మందు యిచ్చారా?"

కవిత కళ్లు వాల్చుకుంది అరక్షణం... "ప్రత్యేకం జబ్బు ఏం లేదంటారు. నీర్సంగా వున్నావు. పాలు గుడ్డు పండ్లు తిని బలం పుంజుకోవాలన్నారు. మందు ఇచ్చారు. మందులిస్తారట వాళ్లే. మధ్య మధ్య వచ్చి పరీక్షలు చేయించుకుంటూ ఉండాలంటా. బలం లేకపోతే ఏదో జబ్బు వస్తుంది జాగ్రత్త అంటూ చెప్పారు.. తిండే గడవక పోతే గుడ్లు, పాలు యివన్నీ ఎలా కనకం?" దిగులుగా అంది. కనకం నవ్వింది. కన్నుగీటి "యింకో రెండు గంటలు కష్టపడితే సరి..." అంది. ఎలకకి ప్రాణసంకటం పిల్లికి చెలగాటం అంటే యిదేనేమో? "కనకం, ఏం బతుకే యిది. నామీద నాకే అసహ్యం వేస్తూంది. పంది బురదలో దొర్లుతూ అదే పన్నీరనుకుంటూ బతుకుతున్నట్టు వుంది మన బతుకు. చావు రావాలని ఎన్ని సార్లు ప్రయత్నించినా మృత్యుదేవతకీ నన్ను ముట్టుకోవాలంటే అసహ్యమేనేమో!" గొంతు బొంగురుపోయింది కవితకి.

"సర్లెద్దూ. ఎన్నిసార్లు చెప్పుకున్నా యివే ముచ్చట్లు. నే పోతున్నా. కాసేపు నడుం వాల్చకపోతే నైటుషిప్టు ఎలా చేస్తాం" విలాసంగా నవ్వుకుంటూ వెళ్లిపోయింది.

ఎండలో నడిచి, అలసిపోయి, కాస్త అన్నం కడుపులో పడగానే మత్తులాంటి నిద్ర ఆవహించింది కవితని. అలా ఎంతసేపు నిద్రపోయిందో....

ఆ గాఢనిద్రలో కలలు! పీడకలలు! తోడేళ్లు, నక్కలు మీదపడి పీక్కుతింటున్నాయి. అవి జంతువుల మొహాలు తగుల్చుకున్న మనుషులు! వికృతంగా, వికటాట్టహాసం చేస్తూ తనవంటి మీద గుడ్డలన్నీ పీలికలు చేస్తూ, యిష్టం వచ్చినట్టు వళ్లంతా కుళ్లబొడుస్తూ, అందిన చోటల్లా రక్తం జుర్రుకుంటున్నాయి... నొప్పి, బాధ...తప్పించు కునేందుకు, అరుస్తూ... కేకలు పెడ్తూ... చెమటలు కక్కుతూ కళ్లు తెరిచింది. చీకట్లో ఓ అంబోతు తనమీద... ఒక్క తన్ను తన్నింది పొట్టలోకి "ఎవడ్రా నీవు... నీ జిమ్మడ..." "ఏటే కాళ్లు చేతులు తన్నుకుంటూ... ఊపిరి అందక గిజగిజలాడుతూ... ఏసాలు ఏస్తనావు... నన్నే తంతావుటే...." జుత్తు పట్టుకుని గుంజాడు.

"ఒరేయ్, నీ పెళ్లం అనుకున్నావట్రా... తిన్నగా వచ్చి పక్క ఎక్కడానికి. లేరా, ముందు బయటకెళ్లు...." శివంగిలా అరిచింది, మంచం మీదనించి లేస్తూ.

"ఏటి, వూరికే తొంగోడానికొచ్చాననుకున్నావేటి, ఆ కనకం ఏభై నోటుచ్చుకుంది.

అదే ఎల్లమంది లోపలికి... పడేయ్ నా ఏభై, నీలాంటి వాళ్లు పది రూపాయలకొస్తారు. తేడబ్బు" పౌరుషంగా అరిచాడు. "పోరా - పో - దానిదగ్గరే ఆ డబ్బిచ్చుకో. యియాల నాకు వళ్లు బాగులేదు... పో...." అరిచి నీర్సంగా మంచంలో కూలబడింది.

ఇంతజబ్బులో, యింత నీర్సంలో కూడా... 'ఛీ... తన బతుకు... చావాలి ఇంక బతకడంలో అర్థం లేదు. పాతికేళ్లకే నూరేళ్ల అనుభవాలన్నీ పూర్తయ్యాయి... యీ 'ఎయిడ్స్' తనని ఎలాగో తినేస్తుంది... డాక్టరంటుంది నిరాశపడనక్కరలేదు, ధైర్యంగా పోరాడాలి, గెలవాలి అంటూ ప్రతిసారి ధైర్యం చెపుతుంది. మాటలతో బతుకులు వెళ్లమారవు. ధైర్యం ఎలా వస్తుంది. చేతిలో డబ్బుంటే, వంట్లో శక్తి వస్తుంది. పోరాడే పటిమ వస్తుంది. అన్నింటికి డబ్బు కావాలి. దానికోసం నీచపు బతుకు బతికి ఆఖరికి వాతబడింది. ఇంకెక్కడి ధైర్యం!' మళ్లీ మగత నిద్రలోకి జారుకుంది....నిద్రలో కలలాంటి నిజాలు! "ఏయ్. కవిత ఆగు ఎందుకలా వెళ్లిపోతావు పిలుస్తుంటే".. వెనకనుంచి రవి పిలుపు. మామిడి తోపులో కాపలా కాసేవాడు, స్కూలునుంచి వచ్చే టైముకి రెడీగా సైకిలుతో నిల్చునేవాడు. "ఏయ్ చేయి వదులు, అరుస్తా, ఎందుకిలా నా వెంట పడ్తావ్.. వదలమంటుంటే..' ఆ మాటల్లో బిగువు సడలుతోంది రోజు రోజుకీ. తను రవి చూపుల తూపులకి లొంగిపోతోంది. రెండు నెలలనించి వెంటబడ్తున్న రవి కోపగించినా, కసిరినా, వెంటపడే అతను వద్దనుకుంటూనే దగ్గిరవుతూ...దగ్గిరవుతూ.. ఇద్దరి మనసులే కాక శరీరాలు కల్సిపోయేంత దగ్గిరయ్యారు. ఎన్నాళ్లు.. తొమ్మిదో క్లాసులో మొదలైన ప్రేమాయణం పదో క్లాసు పరీక్షలయ్యే వరకూ.. పరీక్షలయ్యాక మామిడి తోపు నుంచి రాకపోకలు... రవి ధైర్యానికి మెచ్చుకోవాలా, యిరుగు పొరుగు చూసి తల్లికి చెప్తారేమోనని భయపడాలా... జరగాల్సింది భయపడాల్సింది జరిగింది.

ఇంట్లో తన్నులు, కట్టడి... స్కూలు ఫైనలు తప్పింది. రవి 'పారిపోదాం' అంటాడు. అమ్మో అనుకుంది. ఆఖరికి రవి సమ్మోహనాస్త్రం నుంచి తప్పించుకోలేకపోయింది. పారిపోయింది ఇంట్లోంచి. తరువాత కథ మామూలే. ప్రేమ పొరలు తొలగిపోయాక గడపదాటిన ఆడపిల్ల, డబ్బు సంపాదించే దారి తెలియని ఆడపిల్ల ఎక్కడికి చేరాలో అక్కడికి చేరింది. రవి మాయమాటలు నమ్మినందుకు ఎన్నివందలసార్లు తనని తను శపించుకుందో! మగవాడి మోజు నీటిబుడగలాంటిదన్న నిజం తెలిసే సరికి బతుకు సానికొంప చేరింది. అమ్ముకుని బతకడానికి వళ్లు తప్ప ఏం లేని ఆడపిల్ల అదే అమ్ముకుని... అమ్ముకుని రోగాల బారినపడి... ఆఖరికి.. నిద్రలోనే వెక్కి వెక్కి

ఏడ్చింది. తనిలా ఏడవడం కాదు. ఏడుస్తుండగా మెలకువ వచ్చింది. ఎంత ఏడ్చినా ఓదార్చే వారు లేరన్న సత్యం తెలిసి మరోసారి ఏడ్చింది. తనిలా ఏడవడం కాదు. తనని యిలా ఏడ్పించిన మగాళ్లంతా ఏడవాలి, వాళ్లని ఏడ్పించి కక్ష తీర్చుకోవాలి. మగాళ్లని ఏడిపించాలంటే, ఆడదాని శరీరంతో ఆడుకునే అందరినీ శిక్షించాలి. తనకొచ్చిన ఎయిడ్స్ వాళ్లకీ రావాలి. కృంగి కృశించి చావాలి. కళ్లు తుడుచుకుంది ధృఢ నిశ్చయంతో... తలగడ కింద పెట్టిన రిపోర్టు కాగితాలు తీసి చూసింది. తనకొచ్చిన ఇంగ్లీషు ముక్కల పరిజ్ఞానంతో రిపోర్టు చదివింది. ఇదే తన ఆయుధం. తనని యీగతికి తీసుకొచ్చిన మగవాళ్లని శిక్షించే ఆయుధం ఇదే. తను మందులు వేసుకోదు. బతికినన్నాళ్లు బతుకుతూ తనతో ఆడుకునే అందరినీ ఆడిస్తుంది. వాళ్లంతా ఈ ఎయిడ్స్ అంటించుకుని కుళ్లి కుళ్లి ఏడుస్తూ చావాలి!

"అక్కా... ఏమిటి మధ్యాహ్నం పడుకున్నదానివి తెల్లారి లేచావు. మధ్యలో ఆడెవడో వస్తే డబ్బులు లేవన్నావని తప్పక పంపించా. తన్నాపుట గదా. మరి ఎట్టా బతకాలనుకుంటున్నావు? నీవట్టా సేస్తే రేపెవడొస్తాడు? తినే నాలుగు ముద్దలన్నా దొరకాలి కదా. పైగా డాక్టరమ్మ చెప్పింది బలంగా తినాలని. ఏం పెట్టి తింటావు?" కనకం టీ గ్లాసు చేతికందిస్తూ అంది కోపంగా. కవిత మాట్లాడలేదు. ఊదుకుంటూ టీ తాగింది సాలోచనగా.

"ఏంటో వంట్లో నీర్సంతో పిచ్చి కోపం వచ్చింది. నిద్దట్లో అంబోతెదవని చూసి బయపడ్డానే.." సంజాయిషీ యిస్తున్నట్టు గొణిగింది.

"సర్లే.... నే బజారుకి పోతన్నా. యింట్లో సరుకులు తెచ్చుకోవాలి. నీకేమన్నా కావాలా..."

"నాదగ్గర డబ్బులు లేవు.." గొణిగింది. "సర్లే... నే తెస్తా. తరువాతివ్వు" కనకం బయటికెల్లింది.

కనకం ఉప్పు, పప్పు, బియ్యం తెచ్చుకుని యిల్లు చేరేసరికి గుమ్మం ముందే రిపోర్టు కాగితాలు చించి ముక్కలు ముక్కలు చేసినవి యిల్లంతా పరుచుకున్నాయి. వాటిమధ్య మాత్రల బిళ్లలు. కవిత స్నానం చేసి జుత్తు చిక్కు తీసుకుంటోంది.

"అక్కా ఏమిటి మందులన్నీ యిలా పారేశావు. అయ్యో, ఈ రిపోర్టు కాగితాలు చించేశావు. యీ కాగితాలు పట్టుకెళ్లందే మళ్లీ చూడరు గదా" ఆందోళనగా అడిగింది. "ఇంక మళ్ళీ వెళ్లను. ఏ మందులూ వేసుకోను. అందుకే పారేశాను."

"అక్కా!" అయోమయంగా చూసింది కనకం.

"కనకం.. నాకింక బతకాలని లేదు. బతుకుపోరాటం చేసే శక్తి లేదు. వున్నన్ని రోజులు నా దగ్గరకొచ్చే మగాళ్లకి సంతోషం పంచుతాను. ఏ భోగం కోసం వస్తారో అది భోగం కాదు రోగం అన్నది వాళ్లకి అర్థమయ్యేట్టు చేయడమే నా ధ్యేయం." కసిగా పెదాలు బిగపట్టి కటువుగా అంది. "నా ఆస్థి అందరికీ దానం ధర్మం చేస్తానంటున్నాను." తెల్లపోయి చూస్తున్న కనకంతో నవ్వుతూ అంది.

"ఆస్థా, నీకున్న ఆస్థేమిటి?"

"పోయేముందు వున్నదేదో నలుగురికీ పంచుతారు కదా..." మళ్లీ నవ్వింది.

ఆమె మొహంలో వికృతానందం చూసి కనకం కలవరపడింది. "అక్కా" అంది గాబరాగా. "ఏమైంది నీకు, అలా మాట్లాడుతున్నావేమిటి?"

"నీకర్థం కాదులే" విలాసంగా నవ్వింది.

"కనకం.. నీకో రహస్యం చెప్పనా. నాకొచ్చిన జబ్బు ఏంటో చెప్పనా. చెబితే నాకు దూరం అవ్వనని ఒట్టేయి."

కనకం కళ్లు వాల్చుకుని "నీవేం చెప్పక్కరలేదు. నాకు తెలుసు ఆ సంగతి. నీ రిపోర్టు కాగితాలు నేను మొదటిసారి చూసినప్పుడే నాకు తెలుసు."

"నీకు తెలుసా? ఎలా?"

"నాదీ నీలాంటి కేసే కదా! అక్కా! యిన్నాళ్లు జబ్బు సంగతి నేనెవ్వరికీ చెప్పకుండా దాచిపెట్టాను. చెబితే నన్ను అందరూ దూరం పెడతారని, నా దగ్గరకి ఏ మొగాడూ రాడని..." తలదించుకు అంది. "అంటే నీకు హెచ్.ఐ.వి. ఉందని తెలిసీ...." తెల్లబోతూ అడిగింది కవిత.

కనకం నిర్లక్ష్యంగా నవ్వింది. "చావనీ వెధవల్ని! నాకేం బాధ. నా డబ్బులు నాకు కావాలి బతకడానికి. మనల్ని వాళ్లు సంతోషానికి వాడుకోవడం లేదూ. మనమెందుకు వాళ్లకోసం బాధపడాలి." కసిగా అంది.

కవిత మొహంలో రంగులు మారాయి. మంచం మీద కూలబడింది. "ఏయ్ వంట చేసుకోవాలి. అదిగో అక్కా మనం ఏదీ ఆలోచించకూడదు. బతికినన్నాళ్లు హాయిగా రెండుపూటల తిండితినడమే మన పని. జల్సాగా వుందాం. తక్కిందంతా మనకి అనవసరం. అదిగో నీ సామాను బిల్లు" తన గదిలోకి వెళ్లింది కనకం.

ఆ రాత్రి... నిద్రపట్టక దొర్లుతూనే వుంది కవిత. తన ఆలోచన ఎంత సబబు? తన ఆలోచనా ధోరణి యిలా వుందేమిటి! తన నిర్ణయంతో, అవతలి వాళ్లమీద కసి తీర్చుకోవడం కోసం... ఛా... తనీ పని ఎలా చేయగలదు? కనకం చేస్తోంది కదా! కనకంలాంటి వాళ్లు ఎంతమంది ఉన్నారో.. రోగం సంగతి తెలియక కొందరు.. తెలిసి గతిలేక కొందరు... ఒకరి ద్వారా ఒకరు... ఇలా ఎంతమంది రోగాన పడుతున్నారో... దేశం నిండా ఈ రోగాన్ని తనలాంటి వాళ్లు అంటించి ఒదులు తున్నారు. తనూ యాభై మందికో... వందమందికో... గుండె దడదడలాడింది.

హఠాత్తుగా కళ్లముందు రెండేళ్లక్రితం చనిపోయిన కరీం భార్య, కొడుకు గుర్తు కొచ్చారు. తాగుబోతు కరీం లారీ డ్రైవరు. తెగ తాగేవాడు. ఆఖరికి హెచ్.ఐ.వి. సోకి శవం లాగా మారాడు. పిల్లలిద్దరికీ జబ్బు సోకిందని పరీక్షల్లో తేలింది. కరీం భార్య ఫాతిమా సగం చచ్చింది. ఆ బాధలు పడలేక అందరూ... అబ్బో ఆ విషయం గుర్తుకొస్తే ఇప్పటికీ వెన్నునుంచి చలి పాకుతుంది. బస్తీ అంతా భయంతో బిక్కచచ్చి పోయారు. భయంతో ఆసుపత్రికి పరుగెత్తి పరీక్షలు చేయించుకున్నారు. తమ బస్తీలోనే మరో ఇద్దరు మగాళ్లకు ఉందని పరీక్షల్లో తేలితే ముందుగా మేల్కొని మందులతో తగ్గించుకున్నారు. మళ్లీ ఇప్పుడు తనకి, కనకానికి... తమ వల్ల ఇంకా ఎంతమందికి ఇది అంటుకుంటుందో! మగాళ్ల మీద కోపంతో తమ నిర్ణయం మగాళ్లనే కాదు... ఆడవాళ్లు, వాళ్లు కన్న పిల్లలూ అందరూ బలౌతారు కదా! అశుభం శుభం తెలియని పిల్లలు, ముందు తరాలు ఈ రోగంతో బాధ పడాలని కోరుకోవటం ఎంత రాక్షసత్వం, ఎంత ఆత్మవంచన!

చించేసిన రిపోర్టు కాగితాలవంక చూసి... మళ్లీ ఇమ్మంటే ఇస్తారేమో! నెమ్మదిగా లేచి మాత్రలన్నీ ఏరుకుంది. లోపలికి వచ్చిన కనకం ఆశ్చర్యంగా చూసింది.

"కనకం, ఆ మధ్య యాదమ్మ అడిగింది కదా ఓ ముసలావిడ ఒంటరిగా వుంటుంది, చూసుకునే మనిషి కావాలని. ఎవరన్నా దొరికారంటనా?"

"ఏమో తెలియదు. అయినా నీకెందుకు.?"

"వుండు. యాదమ్మను అడిగి వస్తాను" అంటూ బయటికి వెళ్లింది కవిత.

(ఆశాదీపం - హెచ్.ఐ.వి./ఎయిడ్స్‌పై రచయిత్రుల కథాసంకలనం - 2014)